# The Word of Truth

# సత్యవాక్యము

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

## రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల సువార్త ప్రసారములు

**తెలుగు — సత్యవాణి**

ఆదివారము నుండి శనివారము వరకు మధ్యాహ్నం **2-30** గం॥లకు

**హిందీ — సత్యసుసమాచార్**

మంగళవారము, గురువారము, శుక్రవారము — 9-00 to 9-15 P.M.

శనివారము — 9-45 to 10-00 P.M.

**ఇంగ్లీషు — The Voice of Truth**

ఆదివారము — 10-15 to 10-30 P.M.

మంగళవారము — 9-30 to 9-45 P.M.

**తమిళం — The Way of Truth**

మంగళవారము — 5-30 to 5-45 P.M.

గురువారము — 6-45 to 7-00 P.M.

శుక్రవారము — 6-45 to 7-00 P.M.

**మలయాళం — The Voice of Truth**

మంగళవారం — 3-45 to 4-00 P.M.

శుక్రవారము — 3-45 to 4-00 P.M.

---

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికీ విప్పించండి.
తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు
కరస్పాండెన్సు కోర్సు కొరకు ఈ దిగువ చిరునామాకు వ్రాయండి:

**SATYAVANI**

**P.O. Box 80, KAKINADA - 533 001**

---

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ-1

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P.O. Box 80, KAKINADA-533 001**

*Editor* — **J.C. CHOATE**

*Managing Editor* — **JOSHUA GOOTAM**

*Pleading for restoration of pure New Testament Christianity.*

సంచిక 2 సెప్టెంబరు **1980** సంపుటి **1**

## సంపాదకీయము

### చెప్పే అధికారము ఎవరి కున్నది?

మన జీవిత సమస్య లన్నిటిలో ఎల్లప్పుడు ఒక అధికార పరిమాణముతో మనము జీవించవలసి వచ్చుచున్నది. మన యిండ్లలో తండ్రి ఒక అధికారి. ప్రతి పోస్టాఫీసులోను ఇంత బరువున్న ఉత్తరానికి ఇన్ని పైసల స్టాంపుల నతికించవలెనని మనకు చెప్పేవారున్నారు. మార్కెట్టులో ప్రమాణము చొప్పున యున్న తూనిక రాళ్లు ఎల్లప్పుడు వినియోగించ బడుచున్నవి. అట్లే బట్టల దుకాణములో ప్రమాణము చొప్పున యున్న కొలబద్దలు వినియోగించ బడుచున్నవి. ఆఫీసులలోను, వ్యాపారసంస్థలలోను, పాఠశాలలలోను, పోలీసు సంస్థలలోను, సైనికదళములలోను ఆజ్ఞ లిచ్చుటకును, అమలు జరుపుటకును అధికారము గల వారొక రుండవలెను. అట్లు చేయుటలో అత డధికారి యని

గుర్తింప బడవలెను. మరియు అంగీకరించ బడవలెను. అయితే ప్రతి వాడు ఒక అధికారి యని, యజమాని యని, అతని మాటలే వినబడ వలెనని ప్రవర్తించుచున్నప్పుడు, ఒక వ్యక్తికి మరియొక వ్యక్తికి మధ్య ఎల్లప్పుడు భేదాభిప్రాయము లున్నప్పుడు లేదా ఒక ప్రాంతమునకు మరియొక ప్రాంతమునకు మధ్య ఘర్షణ లున్నప్పుడు గందరగోళము, గొప్ప విపత్తు సంభవించును.

ఈ ప్రాథమిక సూత్రములను మత సంబంధ విషయాల్లో తప్ప అన్ని విషయములలోను మనము గ్రహించుకొందుము. అయితే ఎందు వలననో కాని మతసంబంధ విషయాల్లో ప్రతివాడు ఒక అధికారి యని మనము అభిప్రాయపడుచూ యుంటాము. మన భావములు, "ప్రత్యేక బయల్పాటులు", మానవ కల్పిత సూత్రములు అధికార పూరితమైన వని మనము అంగీకరించ ప్రయత్నించెదము. చెప్పే అధికార మెవరికి యున్నదో అనే సమస్యపై యున్న ఈ విభిన్న భావములను బట్టి చూస్తే క్రీస్తునందలి విశ్వాసులమని చెప్పుకొనే వారిలో యున్న అనేక సంఘములు, సంఘ నామములు, సిద్ధాంతములు, ఆచారములు ఏమంత ఆశ్చర్యము కావు.

మనము అడుగవలసిన ప్రశ్న యిది: మత సంబంధ విషయాల్లో చెప్పే అధికారము యెవరి కున్నది? క్రైస్తవ్యానికి ఒకే ఒక్క వక్త గాని, శిరస్సుగాని, అధికారిగాని యెవరైనా ఉన్నాడా? ఆధునిక కాలములో విశ్వాసులందరు నడిపించబడునట్లు ఏదైనా కొన్ని వ్రాతల సంపుటిగాని, ఒక గ్రంథముగాని యున్నదా? ఈ ప్రశ్నలకు జవా బిచ్చుటకు ముందు, అందరి గొంతుకలకంటే పైగా వినబడే గొంతుక లేక స్వరము ఒకటి యుండవలెనను సంగతిని ముందుగా గమనించె దము. క్రైస్తవ్యము గౌరవించబడి ప్రపంచమం దంతటా వ్యాప్తిచెందు నిమిత్తము జీవము కలిగి యుండవలెనంటే దానికొక నాయకుడు లేక

శిరస్సు అంటూ ఒక దుండవలెను. మరియు గ్రంథములకు గ్రంథము, గ్రంథము లన్నిటిపైనను ఉన్న గ్రంథము, బైబిలు. అన్ని గ్రంథములను మించి దానిని మాత్రమే అంగీకరించవలెను. అప్పుడు మాత్రమే నేటి కాలపు ప్రపంచానికి అత్యవసరమయిన నడిపింపును, మార్గ దర్శకత్వమును అది అందియ్యగలదు.

మత సంబంధవిషయాల్లో చెప్పే అధికారము, చేయించే అధి కారము ఎవరికి ఉన్నది? దీనికి జబాబిచ్చుటకు మనము బైబిలునొద్దకే వెళ్ళి క్రీస్తుయొక్క ఈ మాటలను విందము: "పరలోకమందును, భూమిమీదను నాకు సర్వాధికార మీయబడియున్నది" (మత్తయి 28:19). సమస్తాధికారము ఆయనకే చెందు ననుదానిని దయచేసి గమనించండి. తరువాత, ఆయనకున్న ఈ అధికారము పరలోకము- నందును, భూమిమీదను ఉన్నదని ఆయన వక్కాణించినదానిని గమనించుము. ఇంకొక మాటలో చెప్పే అధికారము, ఆజ్ఞాపించే అధికారము, మననుండి కోరే అధికారము, గౌరవించబడి విధేయత చూపించబడే అధికారము ఆయనకున్నదని క్రీస్తు చెప్పుచున్నాడు. దేవుడా యధికారాన్ని ఆయనకు అనుగ్రహించి యున్నాడు. ఆయన నుండి దానిని ఎవడును తీసివేయలేడు. సరిగదా ఆయనను సవాలు చేసే హక్కుగాని, ఆయన స్థానమునకు పోటీపడే హక్కుగాని యెవ్వ నికీ లేదు. ఆయధికారమునుబట్టియే సర్వజనాంగములకు సువార్తను తీసికొని వెళ్ళుడి యని ఆయన తన అపొస్తలుల నాజ్ఞాపించెను.

క్రీస్తు అధికారముయొక్క ప్రాముఖ్యతను చూపించుటకును, ఆయన అధికారమును గుర్తించి ఆయనకు లోబడు అవశ్యకతను చూపించుటకును పేతురు యిట్లనెను: "మోషే యిట్లనెను - ప్రభు వైన దేవుడు నావంటి యొక ప్రవక్తను మీ సహోదరులలోనుండి మీకొరకు పుట్టించును; ఆయన మీతో ఏమిచెప్పినను అన్ని విషయ

ములలో మీరాయన మాట వినవలెను. ఆ ప్రవక్త మాట వినని వాడు ప్రజలలో ఉండకుండ సర్వనాశనమగును" (అపొ.కా. 3:22, 23). ఆ ప్రవక్తయే యేసుక్రీస్తని అతడు చూపించెను (అపొ.కా. 3:26). అది నిజమైన యెడల ఆయన గాక వేరొక ప్రవక్తకు గాని, అధికారికిగాని చోటు లేనే లేదు. చెప్పే అధికారము, అందరినుండియు విధేయత కోరే అధికారము క్రీస్తుకున్నది. ఎవరయితే ఆయన మాట వినరో, ఆయన చిత్తమునకు లోబడరో వారు సర్వనాశనమగుదురు.

క్రీస్తుయొక్క సర్వోన్నతమైన అధికారమును వర్ణించే వచనములు బైబిలునందనేకములున్నవి. ఉదాహరణకు ఆయన శరీర మయిన సంఘమునకు శిరస్సని చెప్పబడి యున్నది. క్రీస్తును గూర్చి చెబుతూ పౌలు ఇట్లు వ్రాసెను: "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము ఆయన ఆదియై యుండి మృతులలో నుండి లేచుటలో ఆది సంభూతుడాయెను" (కొలస్స 1 : 18). ఎఫెసులోని క్రైస్తవులకు పౌలు ఇట్లు వ్రాసెను: "ఆయన క్రీస్తునందు వినియోగపరచిన బలాతిశయమును బట్టి విశ్వ సించు మనయందు ఆయన చూపుచున్న తన శక్తి యొక్క అపరిమిత మైన మహాత్మ్య మెట్టిదో మీరు తెలిసికొనవలెనని ... ఆయన ఆ బలాతిశయముచేత క్రీస్తును మృతులలో నుండి లేపి, సమస్తమైన ఆధి పత్యము కంటెను, అధికారము కంటెను, శక్తికంటెను, ప్రభుత్వము కంటెను ఈ యుగమునందు మాత్రమేగాక రాబోవు యుగమునందును పేరు పొందిన ప్రతి నామముకంటెను, ఎంతో హెచ్చుగా పరలోకము నందు ఆయన తన కుడి పార్శ్వమున కూర్చుండ బెట్టుకొని యున్నాడు. మరియు సమస్తమును ఆయన పాదములక్రింద ఉంచి సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై

యున్నది" (ఎఫెసీ 1:19-23). "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్న లాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు" (ఎఫెసీ 5:23). శిరస్సు యొక్క ప్రయోజన మేమిటి? నడిపించుటకు, మార్గమును చూపించుటకు, ఆజ్ఞలను జారీ చేయుటకు, సభ్యులను వాటి ప్రకారము నడిపించుటకే గదా? ఎన్ని శిరస్సు లున్నవి? ఒకే ఒక్కటి. అదే క్రీస్తు. ఆ ఒకే శిరస్సు నడి పించు నిమిత్తము ఉన్న శరీరము ఒకే ఒక్కటి, అదే ఆయన సంఘము.

క్రీస్తే ప్రభువై యున్నాడు; ఆయన ప్రభువు గనుక తన ప్రజ లను ఆయన సర్వాధికారము కలిగి పాలించుచున్నాడు. ఆయన జన్మిం చకముందే "ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారు డనబడును; ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయన కిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగ యుగములు ఏలును; ఆయన రాజ్యము అంతము లేనిదై యుండును" అని చెప్ప బడెను (లూకా 1 : 32, 33). క్రీస్తును గూర్చి బాప్తిస్మ మిచ్చు యోహాను ఇట్లు సాక్ష్య మిచ్చెను : "పైనుండి వచ్చువాడు అందరికి పైనున్నవాడు; భూమి నుండి వచ్చువాడు భూసంబంధియై భూసంబంధ మైన సంగతులను గూర్చి మాటలాడును; పరలోకము నుండి వచ్చు వాడు అందరికి పైగా నుండి తాను కన్నవాటిని గూర్చియు, విన్నవా టిని గూర్చియు సాక్ష్య మిచ్చును; ఆయన సాక్ష్యము ఎవడును అంగీక రింపడు. ఆయన సాక్ష్యము అంగీకరించినవాడు దేవుడు సత్యవంతు డను మాటకు ముద్రవేసి యున్నాడు. ఏలయనగా దేవుడు తాను పంపినవానికి కొలత లేకుండ ఆత్మ ననుగ్రహించును. గనుక ఆయన దేవుని మాటలే పలుకును. తండ్రి కుమారుని ప్రేమించుచున్నాడు గనుక ఆయన చేతికి సమస్తము అప్పగించి యున్నాడు" (యోహాను 3:31-35). క్రీస్తు యిట్లనెను : "తండ్రిని ఘనపరచునట్లుగా అందరును

కుమారుని ఘనపరచవలెనని తీర్పు తీర్చుటకు సర్వాధికారము కుమారునికి అప్పగించి యున్నాడు; కుమారుని ఘనపరచనివాడు ఆయనను పంపిన తండ్రిని ఘనపరచడు" (యోహాను 5:22, 23). చివరిగా, యేసునుగూర్చి పేతురు ఇట్లనెను. "ఆయన పరలోకమునకు వెళ్ళి దూతలమీదను అధికారులమీదను శక్తులమీదను అధికారము పొందినవాడై దేవుని కుడిపార్శ్వమున ఉన్నాడు" (1 పేతురు 3:22).

క్రీస్తు యొక్క సంపూర్ణాధికారమును గూర్చియు, అందరిపై ఆయనకున్న ప్రభుత్వమును గూర్చియు సూచించు అనేక వచనములను లేఖనముల నుండి మనము చూచుకొనవచ్చును. అంతే గాకుండ క్రీస్తు మాట్లాడెననియు, ఆయన మాటలు పరిశుద్ధాత్మావేశముచే లిఖింపబడవలెననియు, అవి బైబిలులోను ముఖ్యముగా క్రొత్త నిబంధనలోను లిఖింపబడెననియు నిరూపించుట కనేక వచనములను మనము చూపించి సమయమును వెచ్చించగలము. అది నిజమయిన యెడల క్రీస్తును ఆయన మాటలను సవాలు చేయుటకు నేను నీవు ఎవరము? క్రీస్తును ఆయన మాటలను సవాలు చేయుటకు నేను నీవు ఎవరము? ఉదాహరణకు 2 తిమోతి 3:16-17; 2 పేతురు 1:3; గలతీ 1:7-9; ప్రకటన 22:18, 19 లను చదువుము. అట్లయిన క్రీస్తుతోను ఆయన బోధలతోను సరిసమానముగ తూగగలవాడనని యెవడైనను ఎందుకు ఆలోచించవలెను? ఆయనతో సరితూగగలవాడెవడు? మన ఘనత విధేయతలకు పాత్రులగునట్లు వారేమి చెప్పగలరు? ప్రభువు మాటకంటె పైగా ఒక మనుష్యమాత్రుని మాటలను ఎవరైనా ఎట్లు గౌరవించగలరు? అయినను ఇది ఎల్లప్పుడు జరుగుచునే యున్నది. ఎందువలన? ఎందువలననగా ఈ ప్రజలు మత విషయాల్లో ఉన్న ఒకే ఒక్క అధికారి యగు క్రీస్తును గుర్తించలేనందువలన.

భక్తి మార్గములో మనము ఏమి చేయవలెనో చెప్పే యధికారము ఎవరికి ఉన్నది? అట్టి యధికారమును మానవమాత్రుడెవడయి

నను ఆరోపించుకొనగలడా? నేటి మనదినాల్లో ఎవడైనా మానవుని ద్వారా ప్రభువు పలుకుచున్నాడా? ఆయా సంఘములను స్థాపించి వాటిపై శిరస్సుగా యుండు నిమిత్తము వివిధ మానవులకు సెలవు ఇయ్యబడుచున్నదా? లేఖనములకు విరుద్ధముగా యున్న సిద్ధాంతములను బోధించుటకు నేటి బోధకులకు అధికారమున్నదా? నీవెట్లు జవాబిచ్చినను సరేగాని, నేటి కాలపు మత ప్రపంచములో జరుగుచున్న సంగతి యిది. అందువలననే ఇంత గలిబిలి, ఇన్ని చీలికలు ఈనాడున్నవి.

మానవులందరిని బైబిలు నొద్దకు, సమస్తాధికారమును కలిగి యున్న ఆయన యొద్దకు, క్రీస్తు నొద్దకు మేము పిలుచుచున్నాము. ఆత్మావేశ లేఖనములను బైబిలుద్వారా ఆయన నీతో మాట్లాడుచుండగా ఆయన మాటలను మాత్రమే వినుము. ఆయన బోధకు లోబడి నిన్ను ఆయన సంఘముతో చేర్చనిమ్ము. ఆయన చిత్తమునకు లోబడుచూ యుండుము. మరియు "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చు వాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" అని ఆయన చెప్పిన దానిని జ్ఞాపక ముంచుకొనుము (యోహాను 12:48).

## మతాదికారము

—జాషువా గూటం

ప్రపంచములో జరుగు ప్రతిక్రియ వెనుక ఒక చట్టమున్నది. ఒక కాంట్రాక్టరు బిల్డింగును కట్టుచున్నయెడల అతనికీయబడిన ప్లాను ప్రకారము దానినతడు నిర్మించవలెను. లాయరొకడు ఒక కేసును వాదించుచున్నయెడల అతడు చట్టప్రకారము వాదించవలెను. విద్యార్థులు ఏదైనా ఆటను ఆడుచున్నయెడల వారు రూల్ ప్రకారము ఆడవలెను. నిజానికి మనము చేయు ప్రతి సంగతి కూడా ఏదో ఒక

చట్టప్రకారము జరుగుచునే యున్నది. అట్టి క్రమబద్ధమయిన చట్ట ప్రకారము మనము జీవించలేని యెడల ఈ భూమిపై మన జీవితము దుర్లభ మగును. చట్టబద్ధమైన జీవితాన్ని మానవులు జీవించలేని యెడల సమస్త పరిశ్రమలు, వాణిజ్యము, దేశ దేశాలమధ్య జరిగిన ఒప్పందములు, వినోదములు, కోర్టులు, ఆఫీసులు, బడులు మొదలగున వన్నియును మూయవేయబడును. మానవులు చట్ట సంబంధమైన అధికారమునకు లోబడనప్పుడు భూమిపై గందరగోళము, గలిబిలి తప్ప మరొకటి ఉండదు అని మనందరము ఎరిగిన విషయమే. ఆత్మీయ సంబంధమైన విషయములలో కూడ మానవులు ఈ అధికారమునకు లోబడి నడచుకొనుట బహు ప్రాముఖ్యమైనది.

అయితే క్రైస్తవ్యములో మనము ఎవరి అధికారము చొప్పున నడుచుకొన వలెను? ఆత్మీయ విషయములలో అనేకుల అధికారమునకు మనము లోబడిన యెడల గలిబిలి తప్ప మరొక గత్యంతరము మనకు కనపడదు. క్రైస్తవులు చేయు క్రియ లన్నియును కూడ ఒక నిశ్చలమైన అధికారము చొప్పున చేయవలెను. ఆత్మీయ విషయములలో కూడ ఏది మంచిదో, ఏది చెడ్డదో తెలియజేయు స్థావరము S tandard) మనకు అవసరము. 'క్రైస్తవ లోకమును' ఈనాడు మనము గమనించిన యెడల అందు అనేక చీలికలు కన్పడుచున్నవి. క్రీస్తులోనే యున్నామని చెప్పుకొను అనేక సంఘము లున్నవి. గాని వారు బోధించు సిద్ధాంతములలో ఒకదాని కొకటి పొసగదు. వారి ఆచారములు వేరు. ఇట్టి చీలికల వలన కలిగేది గందరగోళమే తప్ప మరొకటి కాదు. క్రైస్తవ్యములో యున్న ఈ చీలికలు చూచి ఇందులో ఏది సరియైనది? నా ఆత్మరక్షణకొరకు నేనెవరి అధికారమునకు లోబడవలెను? అనే తలంపులు మీకును అనేకసార్లు రావచ్చును.

అన్ని విషయములలోవలె ఆత్మీయ విషయములోకూడ మనము

సత్యమును బట్టి నడుచుకొనవలెను. నిజానికి లోకమంతయు సత్యాన్నే అన్వేషించు చున్నది, అసత్యాన్ని ద్వేషించుచున్నది. అనేకులు అబద్ధమాడి మనలను మోసగించ వచ్చును. అందువలననే మనము సత్యాన్ని తెలిసికొనుట అతి ప్రాముఖ్యమైనది. అందుకే యేసు ఇట్లు చెప్పుచున్నాడు: "మీరు నావాక్యమందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు. అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహాను 8:31, 32). గనుక ఆత్మీయ విషయములలో ఏది సరియైనదో మనము నిర్ణయించాలంటే సత్యమును ముందు మన మెరుగవలెను. దేవుని వాక్యమే సత్యము అని యోహాను 17:17 లో యేసు చెప్పుచున్నాడు. యోహాను 14:6 లో నేనే మార్గమును, సత్యమును, జీవమును అని యేసు చెప్పుచున్నాడు. గనుక క్రైస్తవ్యములో ఏది సరియైనదో మనము తెలిసికొనాలంటే ముందు దేవుని వాక్యమును, యేసుక్రీస్తు బోధలను ఎరుగవలెను.

మనము యేసుక్రీస్తు యొక్క ఆజ్ఞలను బట్టి నడుచుకొనవలెనని దేవుడు కోరుచున్నాడు. మన ఆత్మీయ మార్గదర్శిగా యుండు అధికారమును క్రీస్తు ఒక్కడు మాత్రమే కలిగి యున్నాడు. యేసుక్రీస్తు బోధించుచుండగా ఆనాటి మత గురువులు ఆయన యొద్దకు వచ్చి ఏ అధికారమువలన నీవు ఈ కార్యములు చేయుచున్నావు? అని ప్రశ్నించిరి (మత్తయి 21 : 23). యేసు బోధించుచున్నప్పుడు జన సమూహములు ఆయన బోధకు ఆశ్చర్య పడుచుండిరి. ఏల యనగా ఆయన వారి శాస్త్రులవలెగాక అధికారముగల వానివలె వారికి బోధించెను (మత్తయి 7:28, 29). యేసుక్రీస్తుకు అధికారమును ఎవరు ఇచ్చెనో అను దానికి మత్తయి 17 : 5 లో దేవుడే జవాబిచ్చెను. యేసును చూపించుచు, "ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు, ఈయనయందు

నేనానందించుచున్నాను, ఈయన మాట వినుడి" యని తండ్రియైన దేవుడు సాక్ష్యమిచ్చెను. మనము యేసుక్రీస్తు మాటలకు లోబడవలెను. "ఏలయనగా దేవుడు తాను పంపినవానికి కొలతలేకుండ ఆత్మననుగ్రహించును గనుక ఆయన దేవుని మాటలే పలుకును" (యోహాను 3:34). అందువలననే "తండ్రియందు నేనును, నాయందు తండ్రియు ఉన్నామని నీవు నమ్ముటలేదా? నేను మీతో చెప్పుచున్న మాటలు నా యంతట నేనే చెప్పుట లేదు" అని యోహాను 14 : 10 లో యేసు బోధించెను.

యేసు చేసిన బోధలు, సూచక క్రియలు, అద్భుతములు అన్నియును యేసుక్రీస్తే సర్వాధికారి యని సాక్ష్య మిచ్చుచున్నవి. యేసు క్రీస్తు చనిపోయి తిరిగి లేచిన తరువాత "పరలోకమందును, భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది. కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" యని ఆయన తన అపొస్తలుల కాజ్ఞాపించెను (మత్తయి 28 : 18-20). అందువలన యేసుక్రీస్తు ఆజ్ఞలే మనకు ఆధారము. ఆయన వాక్యమును బట్టియే మన విశ్వాసమును కొనసాగించవలెను. సమస్త జనులకు సువార్తను బోధించి, వారికి బాప్తిస్మమిచ్చి, వారిని శిష్యులనుగా చేయవలెనని యేసు తన అపొస్తలులను ఆజ్ఞాపించెను. యేసు యొక్క ఆజ్ఞలను సమస్త జనులు అపొస్తలులద్వారా వినవలెను.

యేసు యొక్క ఆజ్ఞలను బోధించు అధికారమును ఇప్పుడు పండ్రెండు అపొస్తలుల కీయబడినట్లు మనము గమనించాము. ఆ 12 అపొస్తలులు సత్యమునే బోధించులాగున వారిని సర్వసత్యములో నడిపించుటకు క్రీస్తు వారికి పరిశుద్ధాత్మను వాగ్దానము చేసెను. యేసు వారికి ఇట్లు చెప్పెను: "అయితే ఆయన, అనగా సత్య స్వరూపియైన

ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వ సత్యములోనికి నడిపించును. ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియ జేయును" (యోహాను 16:13).

యేసుక్రీస్తు పునరుత్థానుడైన తరువాత పెంతెకోస్తు అను పండుగ దినమున ఆ 12 మంది అపొస్తలులు పరిశుద్ధాత్మను పొందిరని మన మెరుగుదుము (అపొ. కా. 2:4). పరిశుద్ధాత్ముడు వారి కేమయితే బయలు పరచెనో వాటిని ఆపొస్తలులు ప్రజలకు బోధించిరి. జనులు, వారి బోధలను మనుష్యుల వాక్యమని యెంచక అది నిజముగా దేవుని వాక్యమని అంగీకరించిరి (1 థెస్స 2:13). యేసుక్రీస్తు పరిశుద్ధాత్మ ద్వారా అపొస్తలులకు బయలుపరచగా, క్రీస్తు యొక్క చిత్తమును అపొస్తలులు ప్రజలకు బోధించిరి.

అపొస్తలులు యేసుక్రీస్తు యొక్క చిత్తమును సంపూర్ణముగా బోధించిరి. పరిశుద్ధాత్ముడు వారిని సర్వ సత్యములోనికి నడిపించెను. "దేవుని సంకల్పమంతయు మీకు తెలుపకుండ నేనేమియు దాచుకొన లేదు" అని అపొస్తలుడైన పౌలు చెప్పుచున్నాడు (అపొ. కా. 20:27). అందువలన ఆదిమ క్రైస్తవులు అపొస్తలుల బోధయందు ఎడతెగక యుండిరి (అపొ. కా. 2:42). అపొస్తలులు బోధించినది తప్ప దానికి భిన్నమైన దానిని బోధించుటకు ఎవరికిని అధికారము లేదు. "మేము ప్రకటించిన సువార్తగాక మరియొక సువార్తను మేమైనను, పరలోకము నుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల వాడు శాపగ్రస్తుడవునుగాక", అని పౌలు గలతీ 1:8 లో బోధించెను.

క్రీస్తు సంఘము స్థాపించబడిన మొదటి దినములలో దేవుని వాక్యము అపొస్తలులద్వారా బయలుపర్చబడు చుండెను. ఆ వాక్యమును వారు ప్రజలకు బోధించిరి. అంతేకాదు, దేవుని చిత్తమును

పరిశుద్ధాత్మద్వారా వారు క్రొత్త నిబంధన రూపమున మనకు వ్రాసి యిచ్చిరి. క్రొత్త నిబంధనలో యేసుక్రీస్తు యొక్క ఆజ్ఞలు మనకు కన్పడును. అపొస్తలులును, మరికొందరు భక్తులును క్రొత్త నిబంధనను వ్రాయుచుండగా దేవుడు వారికి పరిశుద్ధాత్మావేశము ననుగ్రహించెను. "మనుష్యజ్ఞానము నేర్పు మాటలతో గాక ఆత్మసంబంధమైన సంగతులను ఆత్మసంబంధమైన సంగతులతో సరిచూచుచు, ఆత్మ నేర్పు మాటలతో వీటిని గూర్చియే మేము బోధించుచున్నాము" అని అపొ. పౌలు సాక్ష్యమిచ్చెను (1 కొరింథీ 2:13). "ఏల యనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" యని అపొ. పేతురు సాక్ష్య మిచ్చెను (2 పేతురు 1:21).

అందువలన మనలను దేవుని యొద్దకును, పరలోకమునకును నడిపించుటకు బైబిలు గ్రంథము ఒక్కటే సరియైనది. దైవావేశము వలన అది వ్రాయబడెను గనుక అది సంపూర్ణ మార్గదర్శియై యున్నది. "దైవ జనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగ సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" అని 2 తిమో 3:16 చెప్పు చున్నది. ఈ సంగతిని గమనించుడి: మానవుని పరిపూర్ణునిగా చేయుటకు ఏమైతే అవుసరమో అదంతయు బైబిలునందున్నది. లేఖనములే సర్వసంపూర్ణములు గనుక, ఆ లేఖనములే మానవుని పరిపూర్ణునిగా చేయును గనుక, ఆత్మీయ విషయములో మానవులు లేఖనములనే అనుసరించ వలెనుగాని వేరొకనికాదు. లేఖనముల ప్రకారము లేని క్రియ ఏదైనను అది సత్క్రియ కానేరదు. లేఖనముల ప్రకారము కాని బోధ ఏదైనను అది సద్బోధ కాదు.

దేవుని చిత్తమంతయు బైబిలునందు, మరి ముఖ్యముగా క్రొత్త నిబంధన యందున్నది గనుక మనము లేఖనములను అనుసరించి నడుచుకొనవలెను. వాటికి మనము కలుపుటగాని, తీసివేయుటగాని చేయరాదు (ప్రకటన 22:18, 19). బైబిలునందు వ్రాయబడిన క్రీస్తుబోధను తప్ప వేరొకదానిని బోధించుటకు మానవునికి గాని, దేవదూతకు గాని అధికారము లేదు. దేవుని అధికారము అంతయు బైబిలునందు ఇమడ్చబడి యున్నందున క్రైస్తవులు దానినిబట్టియే నడచుకొనవలెను. బైబిలును చదువు వాడును, అందులో వ్రాయబడిన సంగతులను గైకొను వాడును ధన్యుడు అని ప్రకటన 1:3 చెప్పుచున్నది.

లేఖనములే సర్వసంపూర్ణములు అని దైవవేదము ఘోషించుచుండగా, అనేకులు దేవుడు నాకు కన్పించాడు, ప్రభువు నాతో మాట్లాడాడు అని చెప్పుచూ యుంటారు. వారు తమ్మును తాము మోసపుచ్చుకొనుటయే గాక, ఇతరులను కూడ మోసగించుచున్నారు. లేఖనములద్వారా తప్ప మరొకవిధంగా దేవుడు మనతో ఈనాడు మాట్లాడుటలేదు (హెబ్రీ 1:1, 2). దేవుడు మీకొక విధముగను, నాకొకవిధముగను తన చిత్తమును బయలుపరచినయెడల, ఆయన పక్షపాతియగును. అయితే దేవుడు పక్షపాతి కాడు అని ఆయన గ్రంథమే బోధించుచున్నది (అ.పొ.కా. 10:34). క్రైస్తవ్యములో కొందరు పెద్దల ఆచారములను బట్టి అనేక సంగతులను చేస్తు యుంటారు. అయితే "మీరు మీ పారంపర్యాచారము నిమిత్తమై దేవుని వాక్యమును నిరర్థకము చేయుచున్నారు ... మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" అని యేసు మత్తయి 15:6-9 లో చెప్పుచున్నాడు.

ఇహపరములందు సర్వాధికారము క్రీస్తుకు ఈయబడియున్నది. గనుక ఆయన సంఘములో రకరకాల శాసనములను ప్రవేశపెట్టుటకు,

మార్పులను తెచ్చుటకు అధికారమును ఒక మనుష్యునికి గాని, ఒక ప్రత్యేక సభకు గాని ఆయన ఇయ్యలేదు. అందువలన ఆయా మత శాఖలలోయున్న మీరు అనుసరించుచున్న బోధ, ఆచారములు ఏ అధికారమువలన వచ్చినవి? అని ప్రశ్నించండి. మనుష్యులు ప్రవేశ పెట్టిన సిద్ధాంతములు, ఆచారములు, నామములు మీరు కనుగొనిన యెడల తప్పక వాటిని తిరస్కరించండి. బైబిలునొద్దకు వచ్చి దేవుని వాక్యమేమి చెప్పుచున్నదో దానినిబట్టి నడుచుకొనండి. ఏలయనగా అంత్యదినమందు మానవకల్పిత సిద్ధాంతములు, ఆచారములనుబట్టి గాక క్రీస్తు వాక్యమునుబట్టి మనకు తీర్పు జరుగును. యేసు ఇట్లు చెప్పు చున్నాడు: "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపనివానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" (యోహాను 12:48). నీ పేరు జీవగ్రంథములో వ్రాయబడవలెనని కోరుచున్నయెడల బైబిలు గ్రంథమును తప్పక అనుసరించుము (ప్రక 20:15).

---

## మానవులందరు యెందుకు మృతి బొందవలెను?

**( *Why must all men die?* )**

—W. A. బ్రాడ్‌ఫీల్డ్

"మనుష్యునిద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను" (1 కొరింథి 15:21).

**A.** మరణము అనగా నేమి?

1. మరణమనగా వెడలిపోవుట (1 తిమోతి 4:6).
2. అది యొక ఎడబాటు (యాకోబు 2:26).
3. అది యొక విడుదల (2 కొరింథి 5:1).

4. అది యొక విశ్రాంతి (ప్రకటన 14:13).
5. అది యొక నిద్ర (యోహాను 11:11).
6. అది నివాసమునకు వెళ్ళుట (యోహాను 14:1-4).

B. మరణమును వర్ణించుట కుపయోగించిన పదములు :—
1. మరణ మొక కోత యంత్రముగా చెప్పబడినది (కీర్తనలు 90 : 6).
2. అది యొక భయంకరమైనగు రాజువంటిది (యోబు 18:14).
3. అది నేతగాని దారపు కత్తిరింపుగా యున్నది (యెషయా 38 : 12).
4. అది నిలువక పారిపోవు నీడ (యోబు 14 : 2).
5. అది మంటిలో పండుకొనుట వంటిది (యోబు 9 : 21).
6. అది గడ్డిపువ్వు వంటిది (1 పేతురు 1 : 24).
7. మరణము మానవుని చివరి శత్రువు (1 కొరింథి 15:26).
8. అది పాండుర వర్ణముగల ఒక గుఱ్ఱముపై కూర్చున్నవాడు (ప్రకటన 6 : 8).

C. ఈ జీవితము క్షణభంగురము :—
1. జీవితమనగా కొద్ది దినములు (యోబు 14 : 1).
2. అది యొక నిద్ర (కీర్తనలు 90 : 5).
3. అది యొక పువ్వు వంటిది (కీర్తనలు 103 : 15).
4. అది గడ్డి వంటిది (యెషయా 40 : 6).
5. అది మాయమై పోవు ఆవిరి (యాకోబు 4 : 14).

D. ఎవరును తప్పించుకొనలేని ఐదు వాస్తవములు :—
1. మనము జీవించవలెను (రోమా 14 : 7).
2. మనము మరణించవలెను (హెబ్రీ 9 : 27).
3. మనము మృతులలో నుండి లేపబడవలెను (యోహాను 5 : 28, 29).

4. మనము తీర్పులో నిలువబడవలెను (2 కొరింథి 5 : 10).
5. మనము నిత్యము వేరొకచోట జీవింపవలెను (మత్తయి 25 : 46).

E. మానవుడు ఎందుకు మరణించవలెను ?

1. అది పాపము యొక్క పర్యవసానము (రోమా 5 : 12). "ఒక మనుష్యునిద్వారా పాపమును, పాపముద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికి సంప్రాప్త మాయెను."
2. అది దైవిక నియమము (హెబ్రీ 9 : 27). "మనుష్యు లొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను."
3. ఇది అంతము కాదుగాని అంతమగుటకు ఒక సాధనము ఒక అభివృద్ధి మార్గము, పరలోక నివాసములో జీవించుటకు ఒక తరుణము (యోహాను 14:1-4).

మానవుడు మరణమును తప్పించుకొనలేడు.

F. మరణము సహజముగా ఎందుకు భయంకరమైనది ?

1. ఇది గుప్తపరచబడిన ఒక సాహసము.
2. ఇది అనుభవములేని ఏకాంత ప్రయాణము (కీర్తనలు 23:4
3. ప్రజలను వస్తువులను స్నేహించుటవలన యిది భయంకరమైనది.
4. ఇది పాపమువలనైన ముల్లు (1 కొరింథి 15:56).

G. క్రైస్తవుడు మృత్యుభీతి నొందరాదు.

1. మరణదినము మేలు (ప్రసంగి 7:1).
2. మరణమైతే లాభము (ఫిలిప్పీ 1:21).

3. మృతులు ధన్యులు (ప్రకటన 14:13).
4. పరిశుద్ధుని మృతి విలువైనది (కీర్తనలు 116:15)
5. క్రైస్తవునికి నిరీక్షణ యున్నది (1 థెస్స 4:13-18).

H. క్రైస్తవుని విజయ మేమిటి?

1. క్రీస్తుద్వారా మరణభీతిని జయించియున్నాము (1 కొరింథీ 15:51-58).
2. ఆయన మరణమునుండి తిరిగి లేచుటద్వారా ఎత్తబడి యున్నామను వాగ్దానము కలిగి యున్నాము (1 థెస్స 4:14).
3. మరణముపై యున్న ఈ విజయోత్సవ నిరీక్షణ క్రైస్తవునికి చెప్ప నశక్యమైన ఆనందము కలిగించుచున్నది (ఫిలిప్పీ 4:4).

I. మరణము కొరకు మానవు డెట్లు సిద్ధపడవలెను?

1. దేవుని యొక్క ప్రేమను, కృపను, దయను స్వీకరించుము (యోహాను 3:16; 2 పేతురు 3:9; హెబ్రీ 2:9).
2 క్రీస్తు సువార్తకు విధేయత చూపుము (2 థెస్స 1:7-9; రోమా 1:16).

(a) విశ్వసించుటకు గల వాస్తవములు (1 కొరింథీ 15 : 1-4). క్రీస్తు యొక్క మరణ, సమాధి, పునరుత్థానములు.

(b) లోబడుటకు గల ఆజ్ఞలు (అపొ. కా. 2:38). విశ్వసించి, మారుమనస్సు నొంది బాప్తిస్మము పొందుము.

(c) ఆనందించుటకు గల వాగ్దానములు (అపొ. కా. 2:38). పాపవిముక్తి, పరిశుద్ధాత్మ వరము, పరలోక నిరీక్షణ.

3. నమ్మకమైన క్రైస్తవ జీవితము జీవించుము (ప్రకటన 2:10; తీతు 2:11, 12).

# దేవుడు మనతో ఎట్లు మాట్లాడును?

**( *How does God speak to us?* )**

—డెల్టన్ హాక్

విశ్వాసుల మని చెప్పుకొనుచున్న వారు కలిగియున్న ప్రాథమిక భిన్నాభిప్రాయములలో, దేవుడు తన చిత్తము నెట్లు తెలియజేయు ననునది ఒకటై యున్నది. ఆయన మన చెవులలో రహస్యముగా చెప్పుననియు, అద్భుతరీతిగా మన హృదయములలో ఉంచుననియు, జీవించుచున్న మానవులద్వారా బయల్పరచుననియు, ఒక సంఘము ద్వారా ఇచ్చుననియు, పరస్పర విరుద్ధమైన పుస్తకములలో వ్రాయించు ననియు, ప్రకృతిద్వారా ప్రత్యక్ష పరచుననియు, బైబిలుద్వారా అను గ్రహించుననియు అనేకులు చెప్పుకొనుచున్నారు. మరికొందరు నేటి కాలమందున్న ప్రవక్తలద్వారాను, స్వప్నములద్వారాను, దర్శనముల వలనను, అంతర్వాణి వలనను బయల్పడు చున్నదని ప్రకటించు చున్నారు. ఇదంతయు దేవుని చిత్తముకాని గందరగోళము తప్ప మరేమియును కాదు. దేవుడు మనతో ఏవిధముగా మాట్లాడును? ఆయన ఎట్లు మాట్లాడును? ఆయన ఏ పద్ధతిని వినియోగించును? మనము కలిగియున్న భిన్నాభిప్రాయములకు, గలిబిలికి దేవుడు కర్తకాడు.

దేవుడు తన చిత్తమును యెన్నడు అబద్ధపు వక్తలద్వారా తెలియజేయలేదు. (ద్వితీ 13:1-5; యెషయా 8:19, 20; యిర్మీయా 23:28-32). ఆయన మానవులతో నానావిధములుగా మాట్లాడెను (హెబ్రీ 1 : 1).

1. దేవుడొకప్పుడు మనుష్యులతో నేరుగా మాట్లాడెను.

(a) ఆదాము (ఆది 2:16, 17; 3:3; 9-19).

(b) కయీను (ఆది 4:5; 9-15).

(c) నోవహు (ఆది 7:1-4; 9:1-17).

2. దేవు డొకప్పుడు స్వప్నములద్వారా మనుష్యులతో మాట్లాడెను.

(a) అబీమెలెకు (ఆది 20:3-6).

(b) లాబాను (ఆది 31:24).

(c) సొలొమోను (1 రాజులు 3:5-15).

3. దేవు డొకప్పుడు దర్శనములద్వారా మానవులతో మాట్లాడెను.

(a) అబ్రాహాము (ఆది 15).

(b) నాతాను (2 సమూ 7:4-17).

(c) దానియేలు (దానియేలు 2:19).

4. ఆయన ఒకప్పుడు దేవదూతలద్వారా మాటలాడెను.

(a) హాగరు (ఆది 16:7-14).

(b) అబ్రాహాము (ఆది 22:11-18).

(c) బిలాము (సంఖ్యా 22:31-35).

5. క్రొత్త నిబంధన కాలమందును ఆయన స్వప్నములద్వారాను, దర్శనములద్వారాను, దేవదూతలద్వారాను మాటలాడెను (మత్త. 2:12, 22; లూకా 1:11-20; 1:24-38; 2:9-15; అపో. కా. 8:26; 12:7-10; 27:23, 24; 9:10-16; 11:5-9; 16:9; 18:9, 10; 26:19).

బైబిలు కాలమందు దేవుడు యేమి మాట్లాడుననునదిప్పుడు సమస్యకాదు. కాని ఆయన నేడు మనతో స్వప్నములద్వారా, దర్శనములద్వారా, దేవదూతలద్వారా, జీవించుచున్న ఆత్మావేశులైన మానవులద్వారా మాట్లాడుచున్నాడా?

ఈ క్రింది విషయముల నాలోచించుము :—

1. దేవుని చిత్తమంతయు ఏకీభవించి యుండును :—

(a) దేవుని పవిత్రుడైన మోషే పాతనిబంధన చట్టము నిచ్చెను.

ఆ కాలము నుండి క్రీస్తువరకు ప్రకటించిన వారందరు ఆయనతో ఏకీభవించిరి. ఆవిధముగా చేయనట్లయితే అతడు అబద్ధ ప్రవక్త యని రుజువగును (ద్వితీ 4:2; 13:1-5).

(b) దేవుని కుమారుడైన క్రీస్తు క్రొత్త నిబంధనచట్టము నిచ్చెను (హెబ్రీ 1:2; 9:15).

ఆకాలము నుండి లోకాంతమువరకు దానికి విభిన్నముగా మాట్లాడరాదు. మాట్లాడిన యెడల అతడు అబద్ధ ప్రవక్త యనుటకు అదియే రుజువు (2 యోహాను 9). యేసును, అపొస్తలులును యేమి బోధించిరో దానికి విరుద్ధముగా యే స్వప్నమైనను, దర్శనమైనను లేక ప్రత్యక్షతయైనను ప్రకటింపబడిన, యెడల దానిని తృణీకరించవలెను.

2. దేవుని సత్యమంతయు క్రీస్తుద్వారాను, అపొస్తలులద్వారాను బయల్పరచబడెను.

(a) జీవమునకును భక్తికిని కావలసిన ప్రతివిషయము బయల్పరచబడెను (2 పేతురు 1:3).

(b) లేఖనములు మనలను ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపరచుచున్నవి (2 తిమోతి 3:16, 17).

(c) యేసు మన విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునై యున్నాడు (హెబ్రీ 12:2). ఆయనకు విధేయులగు వారందరి రక్షణకు కారకుడై యున్నాడు (హెబ్రీ 5:9).

(d) అపొస్తలులు సర్వసత్యములోనికి నడిపింపబడుదురని ఆయన వారికి వాగ్దానముచేసెను (యోహాను 16:13; 14:26). వారు ప్రకటించిన వాక్యము దేవుని వాక్యమై యుండెను (1 థెస్స 2 : 13).

(e) క్రీస్తును, అపొస్తలులును సత్యమును ప్రకటించినట్లయితే అప్పటి నుండి ప్రకటింపబడుచున్న బయల్పాటు ఆకాలము నుండి వారి బోధలకు సరిపడి ఉండవలెను.

(f) జీవమునకును భక్తికిని కావలసిన సత్యమంతయు మొదటి శతాబ్దములోనే ఈయబడిన యెడల జీవమునకును భక్తికిని అవుసరమగున దేదియు బయల్పడునట్లు వదలిపెట్టబడలేదు (2 పేతురు 1:3).

(g) ఆ ఒకేబోధ యెల్లకాలమునకు ఒక్కసారే బయల్పడెను (యూదా 3).

(h) అపొస్తలులు ప్రకటించిన సువార్తగాక మరియొక టేదైనను బోధించిన యెడల వానిపై దేవుని శాపము నిలచియుండును (గలతీ 1:8, 9). వారు ప్రకటించిన సువార్త రక్షించుటకు దేవుని శక్తియై యుండెను, ఎన్నటికిని శక్తిగలదై యుండును (రోమా 1:16).

3. క్రొత్త నిబంధనలో ఉదహరింపబడిన దర్శనములు, దేవదూతలు, స్వప్నములు, క్రీస్తును అపొస్తలులును ప్రకటించిన శుభవర్తమానమును సిద్ధపరచుటకు ప్రకటించుటకు సహాయపడెను. దేవుని గూర్చి తెలిసికొనుటకు కావలసిన యంతటిని, యేసును గూర్చి తెలిసికొనుటకు అవసరమైన దానిని, రక్షణ బొందుటకు, దేవుని సేవించుటకు కావలసిన దానినంతటిని బైబిలు బయల్పరచుచున్నది. దేవుడు బయల్పరచిన దానికంటె యెక్కువైనది ఏదియు లేదు.

4. మనకు లేఖనములున్నవి. దేవుడు జూపిన త్రోవను అవి మనకు ఉపదేశించును. నేడు ఆయన చిత్తమును గూర్చిన జ్ఞానమును మనకు స్వప్నములద్వారాను, దర్శనములవలనను, ప్రవక్తలమని ఆరోపించుకొనుచున్న వారిద్వారాను మనకీయడు. ఆయన చిత్త

మును యేసుద్వారాను, అపొస్తలులద్వారాను బయల్పరచెను. బైబిలునందు ఆ ప్రత్యక్షత మనకున్నది. యేసైనను, అపొస్తలులైనను ఒక సిద్ధాంతమునుగాని ఆచారమునుగాని బోధింపని యెడల మనకును దానితో పనిలేదు. దేవుడు తన కుమారునిద్వారా మనతో మాట్లాడెను (హెబ్రీ 1:2). దేవుని కుమారుడు యేమి చెప్పుచున్నాడో తెలిసికొనుటయే దేవుని చిత్తమును తెలిసికొనుటకు మొదటి మెట్టగును.

---

## క్రైస్తవ్యము మతశాఖ సంబంధమైనది కాదు

—రేమండ్ కెల్సీ.

నీ మతం ఏంటి, అని యే వ్యక్తయినా నన్ను ప్రశ్నిస్తే, నేను క్రైస్తవుడనని అతనికి జవాబిస్తాను. అయితే అతనికి సరైన జవాబీయకుండా తప్పించుకున్నానని అతడు భావిస్తాడు. క్రైస్తవుడు అను పదానికి యీ నాడు ఏలాంటి ఉపవర్గాలు లేకుండా ఉండుట కేవలం హాస్యాస్పదంగా తీసికోబడింది. "అవును నీవు క్రైస్తవుడవు అని నాకు తెలుసు, గాని యే రకం క్రైస్తవుడవు ?" అని ఆలాంటివారు ప్రశ్నిస్తూ ఉంటారు. "నేను యే రకం క్రైస్తవుడను కాను, గాని క్రొత్త నిబంధన కాలంలో ప్రజలు యేలాంటి క్రైస్తవులో అలాంటి క్రైస్తవుడనే" యని నేను వారికి తిరుగు జవాబిస్తాను. అవును, గాని "ఏ మతశాఖకు చెందావు ?" అని వారు మళ్ళా ప్రశ్నిస్తారు. "నేను యే మతశాఖకు చెందను" అని నేను వారి కిచ్చు జవాబై యుండును.

"అదేమి, నీవు తప్పకుండా యేదో మతశాఖకు సభ్యుడవై యుండాలి" అని వారంటారు. అయితే నేను వారి కిచ్చు జవాబు యిలా వుండును: "నా జీవితములో నేనెప్పుడు యే మతశాఖలోను చేరలేదు. నేనుమాత్రం క్రైస్తవుడను—కేవలం ప్రభువు సంఘ

సభ్యుడను. రక్షించబడాలంటే ఏంచేయాలో క్రొత్త నిబంధన చెప్పు తుంది. మరియు రక్షించబడిన వారిని ప్రభువు సంఘమునకు కలుపును (అపొ. కా. 2:42) అని కూడ యిది చెప్పుతుందని మీరు గమనిం చండి. నే నెప్పుడు ఏ సంఘములోను చేరలేదు. ఏ మతశాఖలో కూడ నేనెప్పుడు సభ్యుడను కాలేదు. సువార్తకు మాత్రం లోబడ్డాను, కాబట్టి ప్రభువు సంఘమునకు నన్ను చేర్చారు".

అపొస్తలుల కార్యములలో రక్షించబడిన సంఘటనలను చదివిన వ్యక్తి, అదే ప్రకారం యివి క్రొత్తనిబంధనకాలంలో కూడా ఉన్నట్లు గ్రహిస్తాడు. ఆకాలంలో అవి అలా ఉంటే, యీ కాలంలో కూడ అవి అలాగే వుండాలి. క్రొత్త నిబంధన కాలంలో ఏ మనుష్యుడు యేదైన ఒక మతశాఖకు చేరినట్లు మనం చదువలేము. మతశాఖల సంగతి క్రొత్త నిబంధన లేఖకులకు తెలియదు. ఆనాడు వారు క్రైస్త వ్యాన్ని ఆచరించినట్లు యీ నాడు మనం ఆచరిస్తే, మనం కేవలం క్రైస్తవులమై, క్రొత్త నిబంధన సంఘ సభ్యులుగా యుంటాం, గాని యే ఒక మతశాఖకు చెంది యుండము. దీనిని బట్టి క్రైస్తవ మతం మతశాఖలకు సంబంధించి నట్టిది కాదని అర్థమగుచున్నది.

కొన్ని మతశాఖలు పరస్పర సహవాసం కలిగి వుంటే, యే మత శాఖగా ఉండకుండా వుండగలమని కొందరి భావన. సంఘము మత శాఖ లన్నిటితో కూడి యున్నదని ఆలాంటి వారి తలంపు. గాని సంఘం సమస్త మతశాఖల నుండి వేరై, ప్రత్యేకంగా వుండాలి. దీని సంబంధం మతశాఖలతో పరస్పర సహవాసము "కలదు" అను మాటతో వివరించుట కంటె, సహవాసము "లేదు" అను మాటతో వివరించవలెను. సమస్త మతశాఖల నుండి ప్రభువు సంఘ సభ్యులు దూరంగా ఉండాలని దీని యర్థం. ఇదే నేను క్రీస్తుసంఘాలు చేయు విజ్ఞాపన.

ప్రజలు సువార్త విని, విశ్వసించి, వారి పాపాల నుండి మళ్ళిపోయి, పాప క్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందితే, వారే మత శాఖకు చెందుతారు? తప్పకుండ ఏ మతశాఖకు చెందరు. వీరు సమాజముగా ఏర్పడి క్రైస్తవులుగా దేవుని ఆరాధించుటకు నిశ్చయించుకుంటే, వారింకనూ యే మతశాఖగా కూడా కాలేదు. వీరే ఒక మతశాఖగా అయితే క్రొత్త నిబంధన కాలంలోని ప్రజలు కూడ మతశాఖస్తులే. అయితే పేతురు, పౌలు మిగిలిన క్రొత్త నిబంధనకాలపు వ్యక్తులు మతశాఖల సభ్యులై యుండిరని యెవరు చెప్పినట్టు నేను వినలేదు. వారు మతశాఖ సభ్యులు కానప్పుడు, మనం వారిని వెంబడిస్తే, మనం కూడ మతశాఖ సభ్యులం కాము.

ఏ మానవుడు మతశాఖల పేరు పెట్టుకోవాలని మా కోరిక కాదు, గాని అతడు క్రైస్తవుడను పేరును మాత్రం పెట్టుకోవాలని మా కోరిక. బైబిలును గాకుండా యితర మానవ నియమావళులను అనుసరించమని మా కోరిక కాదు. మరియు నీవు యేదో నొక మత శాఖలో చేరవలెనని కూడ మేము కోరుటలేదు. కాని నీవు సువార్తకు విధేయుడవై ప్రభువుచేత ఆయన సంఘానికి చేర్చబడవలెనని మాత్రం మా కోరిక. నీవు క్రైస్తవుడుగా ఉండగలవు. క్రొత్త నిబంధన కాలంలో క్రైస్తవుడగుటకు ఏమి చేయవలసి యుండెనో అవే నేడును నిన్ను క్రైస్తవునిగా చేయగలవు. క్రొత్త నిబంధన కాలంలో క్రీస్తు సంఘంగా ఉండడానికి ఏమి కావలసి యుండెనో అవే నేడును క్రీస్తు సంఘంగా ఉండుటకు కావలసి యున్నవి.

# పునరుత్థానము - రక్షణ

**( The Resurrection and Salvation )**

—టామ్ హాలండ్

పునరుత్థాన అధ్యాయమగు 1 కొరింథీ 15 ను మనము చదివిన యెడల క్రీస్తు పునరుత్థానమునకును మానవుని రక్షణకును గల సంబంధమును తెలిసికొనగలము. మృతులలో నుండి యేసుక్రీస్తు లేచుటలో ఆయన దైవత్వాన్ని పరలోకము మనకు ప్రకటించినది. "యేసుక్రీస్తు మృతులలో నుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారుడుగా ప్రభావముతో నిరూపింపబడెను" (రోమా 1:7). అతిబలవంతుడైన మరణముపై మన ప్రభువు తనకు గల శక్తిని నిరూపించెను.

దైవావేశ లేఖకులు క్రీస్తు మరణమును గూర్చి యెక్కువ సమయమును వెచ్చించిరి. సిలువయందు మాత్రమే అతిశయించిన పౌలు తాను సిలువ వేయబడిన క్రీస్తునే ప్రకటించెననియు, తాను ప్రకటించు వర్తమానమునకు క్రీస్తుయొక్క మరణమే ఆధారమనియు వక్కాణించెను (1 కొరింథీ 1:23; 2:1-2). అయితే అతడు ప్రకటించు రక్షణ సువార్తలో క్రీస్తుయొక్క మరణమేగాక ఆయన పునరుత్థానము కూడ ఇమిడి యున్నదని అతడు బోధించెను (1 కొరింథీ 15:20).

క్రీస్తుయొక్క పునరుత్థానము క్రైస్తవుడు కూడ మృతులలో నుండి లేపబడునని చేయబడిన వాగ్దానము: "ఇప్పుడైతే నిద్రించిన వారిలో ప్రథమ ఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడి యున్నాడు" (1 కొరింథీ 15:20). క్రీస్తుయొక్క పునరుత్థానమును, మన పునరుత్థానమును నిరాకరించుట నాస్తికత్వ మగును. మానవుని రక్షించు దేవుని పథకములో ఆత్మీయ మరణము నుండి విమోచన మాత్రమే గాక (ఎఫెసీ 2:1, 2) భౌతిక మరణము నుండి శరీరము యొక్క విమోచన కూడ ఇమిడి యున్నది (రోమా 8:23).

మృతి నొందుటకుగాక జీవించుటకు దేవుడు మానవుని సృజించెను. మానవుడు జీవించుటకుగాను తగిన యేర్పాట్లను దేవుడు చేసెను; ఏదేను వనములో ఆయన జీవవృక్షము నుంచెను. మానవుని అవిధేయతవలన భౌతిక మరణమువలె శారీరక మరణము సంప్రాప్త మాయెను. దేవునికి వ్యతిరేకముగా పాపము చేయుటవలన దేవుడతని కొరకై సిద్ధపరచిన స్థలమును, జీవ వృక్షమును పొందే హక్కును మానవుడు కోల్పోయెను. అయితే మన ప్రభువు తన ప్రజలకొరకై సిద్ధపరచే స్థలములో జీవ వృక్ష ముండుటయే గాక, అది నిత్యము ఫలములను ఫలించును! (ప్రకటన 22:2).

---

**BOOK-POST**
Printed Book only

**To**
..............................................
..............................................
..............................................

*From*
**SATYAWAKKU**
**P.O. Box 80**
**KAKINADA - 533 001**